## క్లుప్తంగా

### డిప్యూటీ డైరెక్టర్‌గా మహేశ్వరరావు



మహేశ్వరరావును అభినందిస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ డిప్యూటీ డైరెక్టర్‌గా గొర్లె మహేశ్వరరావుకు పదోన్నతి దక్కింది. ఎన్‌వైకే విశాఖపట్నం ఉమ్మడి జిల్లా యువ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మహేశ్వరరావుకు పదోన్నతి కలిస్తూ సంఘటన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీచ్‌రోడ్డులో ఎన్‌వైకే ప్రాంగణంలో అకౌంట్స్ ఆఫీసర్ పృధ్వి, పూర్వ అకౌంట్స్ ఆఫీసర్ అల్లం రాంప్రసాద్, ఎం.ప్రసన్న, కార్యాలయ సిబ్బంది, ఎస్.నాగేశ్వరరావు, కాంగ్రేగుల వెంకట రమణ, వలంటీర్లు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

### ఏయూ మహిళా కరాటే జట్టు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఆచార్య పల్లవి, డైరెక్టర్ విజయ మోహన్

విశాఖ విద్య: ఏయూ మహిళా కరాటే జట్టు ఎంపిక శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఏయూ దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఈనెల 6 నుంచి 8 వరకు చెన్నైలో జరగనున్న పోటీల్లో ప్రతిభ చూపి, ఏయూ ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ ప్రొఫెసర్ ఎ. పల్లవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు, కోచ్ చెన్నారావ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### చెత్త తొలగింపు



చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు తొలగించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ జీవీఎంసీ సిబ్బందితో మాట్లాడి శుక్రవారం వార్డులో ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### యువకుడిని రక్షించిన పోలీసులు



యువకుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మహారాణిపేట పోలీసులు

అల్లిపురం: రాజమండ్రికి చెందిన 23 సంవత్సరాల కొంగల యేసు అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్‌లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బీచ్ పెట్రోలింగ్ పోలీసులు అతడిని రక్షించి మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని వారికి సమాచారం అందజేశారు. యువకుడిని సీఐ బాసు భాస్కరరావు అతని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



# హమ్మయ్య.. రంగులేశారు

సాక్షి ఎఫెక్ట్..

చిన్నారులు.. పర్యాటకులను ఆకట్టుకునేలా కొత్త అందాలు

ఆకర్షణీయంగా బీచ్‌రోడ్డులోని బొమ్మలు

చిన్నారులు, సందర్శకులను ఆకట్టుకునే ప్రదేశం ఏదైనా ఉందీ అంటే అది సాగరతీరమే అని చెప్పాలి. అటువంటి సాగరతీర ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన పలు జంతువుల ఆకృతులు తర్వాతి కాలంలో శిథిలమయ్యాయి. దీంతో చిన్నారులు, సందర్శకులు నిరాశకు లోనయ్యారు. ఈ విషయంపై సాక్షి వార్త ప్రచురించింది. ఎట్టకేలకు స్పందించిన అధికారులు ఏనుగుల బొమ్మ, పులి బొమ్మ, డ్రాగన్ బొమ్మకు రంగులు వేసి తీర్చిదిద్దారు. దీంతో చిన్నారులు, సందర్శకులు ఆ బొమ్మల వద్ద కేరింతలు కొడుతూ సెల్ఫీలు దిగుతున్నారు.



రంగులద్దిన ఏనుగుల బొమ్మ



ఆకర్షణీయంగా పులి బొమ్మ

ఏయూక్యాంపస్:

బీచ్‌రోడ్డులో పర్యాటకులు, చిన్నారులను అమితంగా ఆకట్టుకునే పరిసరాలను అధికారులు ఎట్టకేలకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వైఎంసీఏకు చేరువలో ఉన్న డ్రాగన్ బొమ్మ, పులి, ఏనుగు బొమ్మలు శిథిలపై, రంగులు వెలిసిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. వీటికి మరమ్మతులు చేపట్టాలని ఇటీవల 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు చివరకు మరమ్మతులు చేశారు. ప్రస్తుతం రంగులు వేసి ఆకర్షణీయంగా తయారు చేశారు. సాయంత్రం వేళల్లో పర్యాటకులు, చిన్నారులు వీటి వద్ద ఫొటోలు తీసుకోవడానికి అమిత ఆసక్తి చూపుతున్నారు. అయితే పనుల్లో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రంగులు వేసి వారం రోజులు అవకుండానే రంగులు వెలిసిపోతున్నాయి. అధికారులు పనుల నిర్వహణతో పాటు నాణ్యతపై కాస్త దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



రంగులు వేసిన తర్వాత డ్రాగన్ బొమ్మ

## అత్యంత వైభవంగా పాశుర విన్నపం



శ్రీవారి దీప హారతిలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి

మద్దిలపాలెం: ఇసుకతోటలోని శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం ధనుర్మాసోత్సవాలలో భాగంగా 19వ పాసుర విన్నపం అత్యంత వైభవంగా చేపట్టారు. దీంట్లో భాగంగా తెల్లవారు జామున సుప్రభాత సేవ, తిరుమంజన సేవ, అలంకరణ, ఆరాధన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఉదయం 4 గంటలకే ఆలయ అర్చకుడు రేజేటి ఉగ్రనరసింహ ఆచార్యులు ఆధ్వర్యంలో ముందుగా గోదాదేవి, వేంకటేశ్వర స్వామి విగ్రహాలను విశేషంగా అలంకరించారు. భక్తులు, సిబ్బంది ఆలయంలో 19వ పాసుర విన్నపాలు చేస్తూ దీప హారతులు చేపట్టారు. ఈ సందర్భంగా తిరుప్పావై పఠనం, సేవాకాలం, వేద పఠనం హారతి, మంగళాశాసనం, శాత్తుమురై మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఉగ్రనరసింహ ఆచార్యులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు. 11వ తేదీ శనివారం కూడార్ై పాశుర విన్నపం, 13వ తేదీ భోగి రోజు గోదారంగనాథుల కల్యాణోత్సవం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన జరపాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో జనగణనతో పాటు బీసీ కులగణన నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. శుక్రవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. చారిత్రాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బీసీ సామాజికి వర్గానికి చెందిన వారిని నియమించాలన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌కి స్వాతంత్ర్య సమర యోధుడు, సాగునీటి పోరాట యోధుడు గౌర్రుపాటి బుచ్చి అప్పారావు పేరు కొనసాగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వెలమ సామాజిక వర్గాన్ని బీసీ–డి జాబితా నుంచి బీసీ ఏ జాబితాలోకి మార్చాలని కోరారు. వెలమ సామాజిక భవనానికి తెలంగాణలో 5 ఎకరాల స్థలం కేటాయించారని, అదే తరహాలో విశాఖలో 5 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. ఉపాధి అవకాశాల్లో వెలమ సామాజిక వర్గానికి తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో వెలమ నాయకులు సత్యం, రాజ్ కుమార్, ఈశ్వరరావు, శ్రీనివాస్, రామ్‌శరన్, వెంకీ పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సర్వీసుపరమైన సమస్యలు పరిష్కరించడంలో కార్యాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. ఏపీ పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలసి శుక్రవారం ఆర్జేడీ విజయ భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో కార్యాలయ ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి సర్వీసు పరమైన సమస్యలైనా, వాటికి తగిన పరిష్కారం చూపేలా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి. ఆనంద్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం. శైలజా కుమారి, కోశాధికారి కృష్ణ చైతన్య, అసిస్టెంట్ డైరక్టర్ బి.వి. నరసింగరావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణాశాఖ ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి



ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడిస్ట్రేషన్) రవివర్మతో చర్చలు జరుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖ ఉద్యోగులపై ఇటీవల జరుగుతున్న అక్రమ వేధింపులు, చర్యల కట్టడికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎ.రవి వర్మ ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం ఈడీని కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరిపామని ఆయన తెలిపారు. ఈ చర్చల్లో ఉద్యోగులను తీవ్రమైన చర్యలతో వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేసుల వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు 2022 జూన్ 1వ తేదీ నుంచి వివిధ డిపోల్లో పెండింగ్‌లో ఉన్న నైట్ అవుట్ అలవెన్స్ సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేసేందుకు అధికారులకు ఆదేశించారన్నారు. చీఫ్ మేనేజర్, ఐటీతో పాటు అన్ని డిపోలకు ఆదేశాలు ఇచ్చి ఉన్నారన్నారు. దీనిపై డిపో కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డిపోల్లో ఎప్పటి నుంచి నైట్ అవుట్ అలవెన్సులు పెండింగ్‌లో ఉన్నాయో సంబంధిత డిపో మేనేజర్లతో మాట్లాడి ఈనెల 6వ తేదీన యథావిధిగా అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ అప్పలకొండ

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్ ప్రాంతంలో గల ధోబీఘాట్ వద్ద సామాజిక భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ శంకుస్థాపన చేశారు. రు. 27 లక్షల అంచనా వ్యయంతో సామాజిక భవనంతో పాటు ధోబీఘాట్, నడక వంతెన నిర్మించనున్నారు. ఒకే స్థలంలో కింద ధోబీఘాట్, పైన నడక వంతెన, దానిపైన సామాజిక భవనం నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి



విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్

అల్లిపురం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని ప్రముఖ ఫిజియాలజిస్ట్ మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూలు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు నిద్ర లేవాలని, యోగా, మెడిటేషన్ ఏకాగ్రతతో చేయాలన్నారు. అనంతరం రివిజన్ చేయటం వల్ల సబ్జెక్టుపై పూర్తి పట్టు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు ఒక స్కూలు విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ ప్రకటన చేయాలి

సీతమ్మధార: ప్రధాని మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేయాలని సీఐటీయూ కంచరపాలెం జోన్ నాయకుడు ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కులో జరుగుతున్న స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయం విరమించుకునే వరకు పోరాడుతామని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని స్పష్టం చేశారు. 32 మంది ప్రాణత్యాగంతో ప్లాంట్ సాధించుకున్నాం అన్నారు. 1367వ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ ప్రొఫెసర్ సూరప్పడు, ఒ.అప్పారావు, భానుమూర్తి, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

# సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థులు



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

ఆరిలోవ: సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పూలే వేషధారణతో అలరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీవీకే కరెస్పాండెంట్ ఎస్.నరసింగరావు, ప్రిన్సిపాల్ మాధురి, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఏయూలో..

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో శుక్రవారం సావిత్రి బాయి పూలె జయంతి నిర్వహించారు. ఏయూ సెనేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ముందుగా సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆమె మహిళా విద్యకు చేసిన కృషి ఆదర్శనీయమని అన్నారు. సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి, పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: సావిత్రిబాయి పూలె జయంతిని మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపక బృంద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఆమె తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జయ మాట్లాడుతూ సావిత్రిబాయి తన జీవితాన్ని మహిళల విద్యకు అందించారన్నారు. చరిత్ర ఉపన్యాసకులు డాక్టర్ బి. సూర్యనారాయణ సావిత్రిబాయి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు, జోనల్ ఎన్.ఎస్.ఎస్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మీ సురేష్

బీచ్‌రోడ్డు: పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జీవీఎంసీ కౌన్సిల్‌లో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ అన్నారు. శుక్రవారం ఆమె వార్డు పారిశుధ్య కార్మికుల కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డును పరిశుభ్రంగా ఉంచటంలో శ్రద్ధ వహించాలని సూచించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు అల్లూరి సీతారామరాజు నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వైద్యులు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ డి.సాయికిరణ్, ఏఎస్ఆర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేపీ నాయుడు సందర్శించారు. 281, 282, 283 సచివాలయాల పరిధిలోని చిన్నారుల వివరాలు, ఆరోగ్య కార్డులను పరిశీలించారు. వారికి అందిస్తున్న సంపూర్ణ ఆహారం మెనూ అమలును పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారుల బరువు, బీటింగ్ సామర్థ్యం, ఫీవర్, దగ్గు, మాల్ న్యూట్రిషన్, పీహెచ్ సమస్యలను నమోదు చేశారు. రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి.దివ్య రేవతి, ఆశ వర్కర్ జి.ప్రసన్న కుమారి, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ సింహాచలమ్మ పాల్గొన్నారు.

## సంరక్షకుల చెంతకు శ్రీకాకుళం మహిళ



శ్రద్ధా టీం సభ్యులతో ఆరాధన

సీతమ్మధార: పోలీసులు ఇచ్చిన సమాచారంతో 4వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆరాధన అనే మహిళను పట్టుకున్నట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం తెలిపారు. ఈమె ఖైనీ, గుట్కాలకు బాగా అలవాటు పడిందన్నారు. మూడు నెలలు షెల్టర్‌లో ఉంచి చికిత్స అందజేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఆమె సొంతూరు శ్రీకాకుళం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అక్కడ గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారని, ఆమె గత 20 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతుందని తెలిపారు. ఆరేళ్ల పాటు విశాఖ ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో కూడా చికిత్స చేయించారని, భర్త వదిలేసి వెళ్లిపోయాడని, సోదరుడు పూర్తిగా మద్యానికి బానిస అయిపోయాడని తెలిపారు. ఆమె గ్రామంలో ఒంటరిదై తిరుగుతూ ఉంటే ఒక చర్చి పాస్టర్ చేరదీసి వైజాగ్‌లో ఉంటున్న సోదరి దగ్గరకు పంపించారని చెప్పారు. గ్రామస్తుల నుండి గార్డియన్ సత్యవతి నంబర్ తీసుకుని మళ్లీ విశాఖలో ఈమెను అప్పగించినట్లు తెలిపారు.


## 7న విజయవాడలో 'విద్యుత్ బస్సుల'పై సదస్సు



మాట్లాడుతున్న సీతాలక్ష్మి

దాబాగార్డెన్స్: విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసీకే అప్పగించాలని కోరుతూ ఈ నెల 7న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏపీపీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విశాఖ రీజినల్ కమిటీ కార్యదర్శి సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో శుక్రవారం ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కేఆర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. 2029 నాటికి ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బస్సుల స్థానంలో పూర్తిగా ప్రైవేట్ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడానికి జీవో 88 ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. పీఎంఈ బస్సు స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టనున్నారని, దీని ఫలితంగా కార్పొరేట్లకు లాభాలు, ప్రజలకు భారాలు మిగులుతాయన్నారు. 46 వేల మంది శాశ్వత ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వాతావరణ కాలుష్యంలో ఆర్టీసీ బస్సుల వాటా కేవలం 0.02 శాతం మాత్రమేనన్నారు. 0.08 శాతం అత్యల్ప ప్రమాద రేటుతో సౌకర్యవంతమైన ప్రయాణం, తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందించాలంటే 3 వేల బస్సులు అవసరమవుతాయన్నారు. ప్రజా రవాణాను ప్రోత్సహించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. కొత్తగా ప్రవేశపెట్టే 750 విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా.. నేరుగా ఆర్టీసీకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ చర్చించేందుకు ఈ నెల 7న విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో జరిగే సదస్సులో సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా ఉద్యమాలే 'సత్యాగ్రహం' చిత్రానికి ప్రేరణ



మాట్లాడుతున్న సత్యారెడ్డి

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు చేసిన ప్రజా ఉద్యమాలు, నాయకుల త్యాగాలు ఉక్కు సత్యాగ్రం చిత్రానికి ప్రేరణ అని చిత్ర నిర్మాత, దర్శకుడు, హీరో సత్యారెడ్డి చెప్పారు. నగరంలోని చిత్రాలయ ఐనాక్స్‌లో ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు, ఉద్యమ నాయకులు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు, చిత్ర నటీనటులతో కలిసి వీక్షించారు. అనంతరం హీరో సత్యారెడ్డి మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది చేసిన ప్రాణ త్యాగాన్ని ప్రపంచానికి తెలియజేస్తూ 37 రోజుల కిందట 150 థియేటర్లలో ఈ చిత్రం విడుదలయిందన్నారు. ఇప్పటికీ అనేక చోట్ల విజయవంతంగా ప్రదర్శించబడుతుందన్నారు. పక్క రాష్ట్రాల్లో కూడా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారని, సినిమా విజయానికి అదే కారణమన్నారు. నటుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. సీపీఎం నాయకులు గంగారామ్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితుల సంఘం ప్రతినిధి నర్సింగరావు, ఉమ్మడి అప్పారావు పాల్గొన్నారు.